క్లుప్తంగా

మిడిల్ పోల్స్ ఏర్పాటు



నల్లబెల్లి : మండల కేంద్ర శివారు ప్రాంతాల్లో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను అధికారులు మంగళవారం సరిచేసేలా మిడిల్ పోల్స్ ఏర్పాటు చేశారు. 'వేలాడుతున్న విద్యుత్ తీగలు' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఎన్‌పీడీసీఎల్ ఏఈ హరిబాబు స్పందించారు. లైన్ ఇన్‌స్పెక్టర్ సాగర్, అసిస్టెంట్ లైన్‌మెన్ సుధాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది 9 మీటర్ల రెండు మిడిల్ పోల్స్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. అలాగే విద్యుత్ తీగల వెంట ఉన్న తుమ్మ చెట్లను తొలగించారు.

సాక్షి స్పందన

'రైతుల పరిస్థితి అధ్వానం'



ఖానాపురం : రాష్ట్రంలో రైతుల పరిస్థితి అధ్వానంగా తయారైందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులపై రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదని, దశాబ్దం నాటి పాలనను గుర్తు చేస్తున్నారన్నారు. రైతులతో సీఎం రాజకీయ క్రీడలు ప్రారంభించారని, ఈ నెల 7 తర్వాత ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఇంటింటికి తీసుకువెళ్తామన్నారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన జాకీర్, రమేశ్ కుటుంబాలను పరామర్శించారు. మాజీ ఎంపీపీ ప్రకాశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీలో జాగ్రత్తలు తీసుకోండి



నెక్కొండ : సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీలో జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి అనురాధ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న డేటా ఎంట్రీని మంగళవారం ఆమె పరిశీలించి సూచనలు చేశారు. తప్పులు లేకుండా నమోదు చేసేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.

యూనిఫామ్ పంపిణీ

వర్ధన్నపేట : పట్టణంలోని 10వ డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలలకు కౌన్సిలర్ తుమ్మల రవీందర్ మంగళవారం యూనిఫామ్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని పిల్లలు వినియోగించుకోవాలని కోరారు. చిన్నారులకు అందించే భోజనం శుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో టీచర్ ప్రేమలత, ఆయా మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో సామగ్రి దగ్ధం

సంగెం : ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని ఇంట్లోని సామగ్రి దగ్ధమైన ఘటన మండలంలోని ఎల్గూర్ రంగంపేటలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఇమ్మడి అఖిల్ భార్య ఇంట్లో దేవుడికి దీపం పెట్టి పనులకు వెళ్లింది. అనంతరం పిల్లి దూకడంతో దీపం కిందపడి మంటలు అంటుకుని ఇంట్లోని దుస్తులు, టీవీ, ఫ్యాన్, తదితర గృహోపకరణాలు కాలిపోయాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గీసుకొండ : మండలంలోని విశ్వనాధపురం సమీపంలో వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా.. చెన్నారావుపేటలోని సిద్ధార్థ హైస్కూల్‌లో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న జగదీశ్, కృష్ణమోహన్ డీఈఓ కార్యాలయంలో పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై తిరిగి వెళ్తుండగా వారి వాహనాన్ని సాయంత్రం ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో జగదీశ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా కృష్ణమోహన్ కాలు విరిగి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సీఐ మహేందర్ ఘటనా స్థలిని పరిశీలించారు.

గుంతలతో పొంచి ఉన్న ప్రమాదం

- మాదన్నపేట పెద్దకాల్వ బ్రిడ్జిపై దుస్థితి
- భయాందోళన నడుమ రాకపోకలు

నర్సంపేట రూరల్ : మాదన్నపేట పెద్దకాల్వ బ్రిడ్జిపై భారీ గుంతపడినా అధికారులు నిర్లక్ష్యం వీడడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సదరు బ్రిడ్జి మీదుగా భయాందోళన నడుమ వాహనదారులు ప్రయాణం సాగిస్తున్నారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు, వాహనదార్లు బెంబేలెత్తుతున్నారు. రాత్రివేళల్లో వాహనదారులు గుంతల్లో పడి గాయాల పాలవుతున్నా పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

నర్సంపేట-నల్లబెల్లి ప్రధాన రహదారిపై నర్సంపేట మండలంలోని మాదన్నపేట చెరువు పెద్దకాల్వ బ్రిడ్జి మీదుగా దాదాపు 10 గ్రామాల ప్రజలతోపాటు నల్లబెల్లి మండలంలోని పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించడం పరిపాటి. ఆర్టీసీ బస్సులు, లారీలు, స్కూల్ బస్సులు, డీసీఎంలు ఎక్కువగా వెళ్తుంటాయి. ఏటా ఈ దారి మీదుగానే మిర్చి పంటను రైతులు అహ్మదాబాద్, నాగ్‌పూర్, ముంబై, పూణె లాంటి ప్రాంతాలకు తీసుకెళ్తారు. అధిక లోడ్‌తో వచ్చే సమయంలో బ్రిడ్జిపై వాహనాలు దిగబడే అవకాశాలున్నాయి. ఇకనైనా కాజ్‌వే నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



బ్రిడ్జిపై ఏర్పడిన భారీ గుంత

తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



మాదన్నపేట బ్రిడ్జి మీదుగా వివిధ పనుల నిమిత్తం నర్సంపేటకు రాకపోకలు సాగిస్తాం. బ్రిడ్జిపై గుంతలు ప్రమాదకరంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రాత్రివేళల్లో ద్విచక్ర వాహనాలు కింద పడి పలువురు గాయాలపాలైన ఘటనలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు, ప్రభుత్వం తక్షణమే స్పందించాలి. కాజ్‌వే నిర్మించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చూడాలి. లేనిపక్షంలో రాత్రివేళల్లో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

– మొలుగూరి సురేందర్, మాదన్నపేట వాసి

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



దుగ్గొండి : బాలలకు కిట్లు అందజేస్తున్న ఎంఈఓ



రాయపర్తి : వికలాంగులకు బ్యాటరీ ట్రైసైకిళ్లు అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని దుగ్గొండి, నెక్కొండ, నల్లబెల్లి, రాయపర్తి, తదితర మండలాల్లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం మంగళవారం నిర్వహించారు. దుగ్గొండిలో వికలాంగ బాలలకు ఎంఈఓ వెంకటేశ్వర్లు ఉపకరణాలు అందజేసి మాట్లాడారు. నడవలేని బాలలకు ప్రభుత్వం ఇంటి వద్దే వైద్యుల చేత ఉచితంగా ఫిజియోథెరపీ చేయిస్తోందని చెప్పారు. నెక్కొండలోని అంబేడ్కర్ భవన్‌లో మండల సమాఖ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేయగా ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్ అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాయపర్తిలో నలుగురు దివ్యాంగులకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ఉచితంగా బ్యాటరీ ట్రైసైకిళ్లు అందించి మాట్లాడారు. దివ్యాంగులకు సమాజం అండగా నిలవాలని ఆకాంక్షించారు. నల్లబెల్లిలోని గ్రంథాలయ ఆవరణలో వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు పులి రమేశ్ కేక్ కట్ చేసి దివ్యాంగులకు పంపిణీ చేసి మాట్లాడారు. వికలాంగుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి పాటుపడతామని చెప్పారు.

అయ్యప్ప ఆలయంలో దివ్య పడిపూజ



అయ్యప్పస్వామికి పూజ చేస్తున్న భక్తులు

నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా ఆధ్వర్యంలో మంగళవారం దివ్య పడిపూజ, పుష్పాభిషేకం నిర్వహించారు. దివ్య పడిపూజ దాత మాదారపు చంద్రశేఖరం రాజ్యలక్ష్మి దంపతులు వారి వివాహ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకుడు దేవేశ్ మిశ్రా పూజ నిర్మాణంలో కలశం, వినాయకుడి, గౌరమ్మ పూజలతో మొదలుకొని జ్యోతులు వెలిగిస్తూ 18 కలశాలపై సాంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించారు. దివ్య పడిపూజ, పుష్పాభిషేకం, మహాఅన్నదాన ప్రసాద వితరణ దాతలు మాదారపు చంద్రశేఖరం రాజ్యలక్ష్మి, ఇరుకు కోటేశ్వర్‌రావు స్వరూప, సాన్విక, మాదారపు రవీందర్ సరస్వతి, కులదీప్, దీకొండ సమ్మయ్య చంద్రకళ, పాలకుర్తి శ్రీనివాస్, రాజ్‌కుమార్, ఓమ కరుణాకర్ సంధ్యారాణి, సాయి కృష్ణ కరుణ, వినీత్, వేంశెట్టి శ్రీనివాస్ రమాదేవి, పావని గిరిధర్, వీరమనేని నారాయణరావు శ్రీలత, చెవ్వ శారద రాజేంద్రప్రసాద్, వి.స్వరూప, వినయ్, ఈశ్వర్, సహన అయ్యప్పస్వాములకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సురేశ్, కార్యదర్శి చింతల కమలాకర్‌రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్, శ్రీరాం ఈశ్వరయ్య, ఇరుకుల్ల వీరలింగం, శింగిరికొండ వేణుగోపాల్, పిన్నా రామనాదం, దోమకుంట్ల సదానందం, చకిలం కృష్ణమూర్తి, అనంతుల రాంనారాయణ, దొడ్డ వేణు, మల్యాల రాజు, శంకరయ్య, బండారుపల్లి చెంచారావు, ఆకుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయం



విద్యార్థులతో మాట్లాడుతున్న వినయ్, హేమంత్

నర్సంపేట : విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గురుకుల బాట కార్యక్రమం చేపట్టినట్టు బీఆర్ఎస్ నాయకుడు సదిరం వినయ్, బీఆర్ఎస్వీ పట్టణ అధ్యక్షుడు దేవోజు హేమంత్ తెలిపారు. పట్టణంలోని మైనార్టీ గురుకుల స్కూల్, కళాశాలతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలికల, బాలుర హాస్టళ్లను వారు మంగళవారం సందర్శించి సమస్యలపై అధ్యయనం చేశారు. అనంతరం వినయ్, హేమంత్ మాట్లాడారు. హాస్టళ్లలో మెనూ అమలు కావడం లేదని, మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఇతర సమస్యలు వేధిస్తున్నాయని తెలిపారు. బీఆర్ఎస్వీ హెల్ప్‌లైన్ నంబర్‌ను నోటీస్ బోర్డుకు అతికించారు. సమస్యలను హెల్ప్‌లైన్ నంబర్‌కు వాట్సప్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు సందీప్, శ్రీకాంత్, రవీందర్, భోలే బాషా, సామల ఉషా కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

నగదు బదిలీలో నిర్లక్ష్యం సరికాదు

- జీఎంపీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లయ్య

గీసుకొండ : లబ్ధిదారులకు గొర్రెలకు బదులు రూ.2 లక్షల చొప్పున నగదు బదిలీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం (జీఎంపీఎస్) జిల్లా గౌరవ అధ్యక్షుడు చల్లా మల్లారెడ్డి అన్నారు. మండలంలోని గంగదేవిపల్లిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ లబ్ధిదారులకు నగదు బదిలీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడాది గడచినా అమలు చేయకుండా మోసపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని మండిపడ్డారు. నగదు బదిలీ సాధన కోసం ఈనెల 9న ప్రజాభవన్‌ను ముట్టడిస్తామని చెప్పారు. ముట్టడికి మండలంలోని లబ్ధిదారులు, యాదవ కులస్తులు తరలిరావాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు చల్లా కొమురయ్య, లింగం, దాసరి మల్లేశ్, కుమార్, రాములు, బండి కుమార్, జక్కుల రాజు, కుమారస్వామి, సతీశ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లయ్య

ఎంబీఏ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుక



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సంపత్

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ ఎంబీఏ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులు శనివారం ఫ్రెషర్స్ డే వేడుక నిర్వహించారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఘనస్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులు నృత్యాలు, ఆటలు, లాజికల్ క్వషన్స్, పాటల పోటీలను నిర్వహించి అలరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హరిహరన్ మాట్లాడారు. మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధన దిశగా క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. సీనియర్లు జూనియర్లకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, సెక్రటరీ డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, బిట్స్ ప్రిన్సిపాల్ హరిహరన్, ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, అకడమిక్ కోఆర్డినేటర్ నారాయణ, ఏఓ సురేశ్, ఎంబీఏ విభాగాధిపతులు నరేశ్, గోపీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు కూలి రేట్లు పెంచాలి



తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మల్లేశం, కార్మికులు

- ఏఐఎఫ్‌టీయూ(న్యూ) అధ్యక్షుడు మల్లేశం

ఖానాపురం : పెరిగిన నిత్యవసర సరుకుల ధరలకు అనుగుణంగా హమాలీలకు కూలి రేట్లు పెంచాలని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మిల్ అండ్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడారు. యాజమాన్యాలు హమాలీలతో చేసుకున్న ఒప్పందం ఈనెల 21తో ముగుస్తోందని చెప్పారు. రైస్ మిల్లుల్లో ప్లాస్టిక్ సంచుల దిగుమతిని విరమించుకోవాలని, కార్మికుల కోసం పని ప్రదేశాల్లో తాగునీటి, ఇతర వసతులు కల్పించాలని, 50 ఏళ్లకుపైబడిన హమాలీలకు రూ.5 వేల పింఛన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాంచందర్, పోశాలు, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి నిరవధిక సమ్మె

పర్వతగిరి : సమస్యల పరిష్కారం కోసం ఈనెల 9వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపడతామని తెలంగాణ సమగ్ర శిక్ష అభియాన్ (టీఎస్ఎస్ఏ) జేఏసీ నాయకులు ప్రవీణ్, తదితరులు తెలిపారు. ఈ మేరకు స్థానిక టీఎస్ఎస్ఏ జేఏసీ ఆధ్వర్యంలో ఎంఈఓ గాయపు లింగారెడ్డికి మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం ప్రవీణ్, తదితరులు మాట్లాడారు. ఉద్యోగుల క్రమబద్ధీకరణ, మినిమం టైమ్ స్కేల్, తదితర డిమాండ్లతో ఈనెల 6, 7తేదీల్లో జిల్లా కేంద్రాల్లో ధర్నా చేస్తామన్నారు. అప్పటికీ ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాని పక్షంలో ఈనెల 9 నుంచి సమ్మె చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు శ్రీనివాస్, లోకేశ్, అశోక్, శిల్ప, జయరాజ్, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

భూమిని కాపాడాలని వినతి

నర్సంపేట : ప్రభుత్వ బాలికల పాఠశాల కోసం ప్రముఖ పారిశ్రామికవేత్త దొడ్డ మోహన్‌రావు దానం చేసిన భూమిని కాపాడాలని కోరుతూ బీసీ కులాల ఐక్యవేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు, భారత చైతన్య పూలే వారసుల రాజ్యం రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజు యాదవ్, బాలికల పాఠశాల విద్యా కమిటీ మాజీ చైర్మన్, బీసీ పవర్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మోడెం రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయ అధికారికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రాజు, రామకృష్ణ మాట్లాడారు. సదరు ఇంటిని ఆక్రమించి కూల్చి వేసి నూతన భవనం కడుతున్నారని తెలిపారు. ఇంటి నిర్మాణం చేపట్టిన వారితోపాటు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మెరుగైన సేవలే 'ఆరోగ్య మహిళా' లక్ష్యం

ఖానాపురం : మహిళలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఆరోగ్య మహిళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్ తెలిపారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మంగళవారాల్లో మహిళలకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. మహిళలు ప్రభుత్వ ఆసుపత్రులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు అరుణ్‌కుమార్, జ్యోతి, కల్పన, సునీత, రాకేశ్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

గణిత టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ

పర్వతగిరి : టీఎంఎఫ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన మండల స్థాయి గణిత టాలెంట్ టెస్ట్‌లో స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి జిల్లా స్థాయికి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ అపర్ణ తెలిపారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, గణిత ఉపాధ్యాయురాలు ఉషను స్కూల్ ఆవరణలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. విద్యార్థులు పల్లవి, కీర్తన, ఝాన్సీ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతి సాధించినట్టు తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

దుగ్గొండి : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసిపోయింది. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి దుగ్గొండి, మల్లంపల్లి, ముద్దునూరు, మహ్మదాపురం కొనుగోలు కేంద్రాల్లో 2వేల బస్తాల ధాన్యం తడిసిపోయింది. రాత్రివేళ కావడంతో అన్నదాతలు నిద్రలో ఉండి కేంద్రాలకు రాలేకపోయారు. సరిపడా టార్పాలిన్లు అందుబాటులో లేవని రైతులు పేర్కొంటున్నారు.

సీఎం కప్ పోటీలను విజయవంతం చేయాలి

సంగెం/నెక్కొండ : సీఎం కప్ పోటీలను విజయవంతం చేయాలని సంగెం, నెక్కొండ మండలాల ప్రత్యేక అధికారులు వేదవతి, అనురాధ కోరారు. ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో మంగళవారం నిర్వహించిన సమావేశాల్లో వారు అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. పోటీలు నిర్వహించే దిశగా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సమావేశాల్లో ఎంపీడీఓలు రవీందర్, ప్రవీణ్‌కుమార్, ఎంఈఓలు రాము, రత్నమాల, తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

చెన్నారావుపేట : తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం మండల కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీకి సంఘం జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్, నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ డ్యాగల శ్రీనివాస్ ఎన్నిక పత్రం అందజేసి మాట్లాడారు. అధ్యక్షురాలిగా బండి విజయ, ప్రధాన కార్యదర్శిగా కారుపోతుల శ్రీదేవి, చెన్నారావుపేట గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా ముంజ లక్ష్మిని ఎన్నుకున్నట్టు చెప్పారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

రాయపర్తి : ఆశవర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి, జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాధవి, రామస్వామి మాట్లాడారు. కలెక్టరేట్ ఎదుట నేడు తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి తుమ్మల సాంబయ్య, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు చైతన్య, నాగమణి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

ఖానాపురం : గ్రామ పంచాయతీ కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలని పంచాయతీ కార్మిక సంఘం అధ్యక్షుడు ఉస్మాన్, ఉపాధ్యక్షుడు వీరన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం కమిటీ ఆధ్వర్యంలో ఎంపీఓ సునీల్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఉస్మాన్, వీరన్న మాట్లాడారు. వేతనాలు అందక పంచాయతీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.

పరిహారం తేల్చాకే సర్వే చేయాలి

- గ్రీన్ ఫీల్డ్ హైవే బాధిత రైతులు



నిరసన తెలుపుతున్న రైతులు

పర్వతగిరి : తమకు ఇచ్చే పరిహారం తేల్చాకే అధికారులు భూముల సర్వే చేపట్టాలని మండలంలోని ఎనుగల్‌కు చెందిన గ్రీన్ ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులు ప్రభుత్వాన్ని కోరారు. పరిహారం ప్రకటించకుండా అధికారులు సర్వేకు వస్తుండడాన్ని వ్యతిరేకిస్తూ గ్రామంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు బోయినపల్లి యుగంధర్‌రావు, తదితరులు మాట్లాడారు. తమకు సరైన పరిహారం ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్‌కు, ఆర్డీఓకు, కలెక్టర్‌కు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని చెప్పారు. భూములకు సరైన ధర నిర్ణయించాలని, టోల్ గేట్ ఆదాయంలో 70 శాతం వాటా ఇవ్వాలని, భూమికి బదులు భూమి ఇవ్వాలని కోరామని తెలిపారు. తమకు న్యాయం చేయకుండా సర్వేకు అధికారులను పంపితే అడ్డుకుంటామని, ప్రాణత్యాగానికైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. న్యాయం కోసం అవసరమైతే ఆందోళనలు చేపడతామని చెప్పారు. సమావేశంలో రైతులు దంశెట్టి నర్సింహ, నల్లపు దేవేందర్, హాజీ, కానుగంటి రాములు, కుమారస్వామి, రాజు, మాసాని మదార్, యాకూబ్, రవి, దేశీరామ్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరి

- ఏపీఎం వేణు, సీబీఓ ఆడిటర్ వెంకట్

వర్ధన్నపేట : గ్రామైక్య సంఘాల సహాయకులు వీఓ రికార్డుల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఏపీఎం వేణు, సెర్ప్ సీబీఓ ఆడిటర్ వెంకట్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎంఎస్ కార్యాలయంలో వీఓలకు 2024 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు జరిగిన లావాదేవీల రశీదులు, ఓచర్ సపోర్టు బిల్లులతో పలు రికార్డులను మంగళవారం వారు పరిశీలించి మాట్లాడారు. రికార్డుల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు, పొరపాట్లు పునరావృతం అయితే చర్యలు తప్పవన్నారు. ఆడిట్లో గుర్తించిన లోపాలపై జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులకు నివేదిక అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎస్ అధ్యక్షురాలు అరుణ, సీసీలు గోలి కొమురయ్య, రమేశ్, వీఓ ప్రతినిధులు హైమ, సునీత, నజీమా, వీఓలు పద్మ, సుభద్ర, లలిత, స్రవంతి, విజయ, రాణి, కంప్యూటర్ ఆపరేటర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ముత్యాలమ్మతండాలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, ఉమ్మడి వరంగల్ పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు మంగళవారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బానోజీపేట పశు వైద్యాధికారి డాక్టర్ వింధ్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. పశువులకు ఆడదూడలు పుట్టేలా సార్టెడ్ సెమెన్ పశువైద్యశాలల్లో, గోపాలమిత్రల వద్ద అందుబాటులో ఉందన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు వినియోగించుకోవాలని సూచించారు. శిబిరానికి 69 పశువులు రాగా 34 ఎదకు రానివి ఉన్నాయని చెప్పారు. 37 దూడలకు నట్టల నివారణ మందు తాగించారు. ఒక పశువుకు కృత్రిమ గర్భధారణ చేయగా 5 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ జహంగీర్, అన్వేశ్, పశుమిత్ర పుష్పలత, మధుకర్ పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించండి

- బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యువరాజు

చెన్నారావుపేట : ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కలువల లలిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆశ వర్కర్లు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని చెప్పారు. జాబ్ చార్ట్ ప్రకారమే పనులు చేయించాలని, ఏఎంసీ టార్గెట్లపై వేధింపులు నిలిపివేయాలని, సర్వే రిజిస్టర్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో బీఆర్‌టీయూ నాయకులు తడిగొప్పుల రణదీప్, సాలమ్మ, మాధవి, వసుమతి, రాధిక, ప్రేమలత, రేణుక, కరుణ, రజిత, సుశీల తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కార్యదర్శి రాజు

నర్సంపేట : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం ఆర్డీఓ కార్యాలయ ఏఓ శ్రీనివాస్‌కు మంగళవారం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా రాజు మాట్లాడారు. ఆరు గ్యారంటీలు తక్షణమే అమలు చేయాలని, వ్యవసాయ కార్మికులకు జీవన భృతి కింద ఏటా రూ.12 వేలు అందించాలని, పేదలకు స్థలం అందజేసి ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేయాలని, తదితర హామీలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ నాయకులు ధార లింగన్న, భానోతు జవహర్‌లాల్, టీయూసీటీ డివిజన్ నాయకులు సింగరబోయిన కట్టన్న, శ్రీరామోజు భద్రయ్యచారి, మోతె వీరారెడ్డి, రాజేందర్, రమేశ్, ప్రవీణ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.